సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

గురువారం । 4 జనవరి । 2024



భూములను కాపాడాలి

రాష్ట్రంలో అన్యాక్రాంతమైన దేవాలయాల భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని తెలంగాణ అర్చక ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ కోరారు.

- 8లో ▸



భక్తులకు ప్రశాంత దర్శనం

మేడారం మహాజాతరలో సమ్మక్క, సారలమ్మ దర్శనాలకు వచ్చే భక్తులకు ప్రశాంత దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తామని దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ తెలిపారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.0° /17.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం పొగమంచు పడుతుంది. మధ్యాహ్నం మామూలు ఉష్ణోగ్రత ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

భూపాలపల్లి జిల్లా ఓఎస్డీగా అశోక్‌కుమార్

భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఓఎస్డీగా అశోక్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో జరిగిన ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా 2019 బ్యాచ్‌కు చెందిన అశోక్‌కుమార్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. కాగా కొన్ని నెలలుగా భూపాలపల్లి జిల్లాకు ఓఎస్డీ లేకపోగా, ములుగు జిల్లా ఓఎస్డీగా పని చేస్తున్న అశోక్‌కుమార్‌కే అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే ఇప్పుడు ములుగు నుంచి ఇక్కడి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా ఆయన నేడో, రేపో బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



భూపాలపల్లి అర్బన్: చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 193వ జయంతిని బుధవారం జిల్లా కేంద్రంలో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఆయా సంఘాల కార్యాలయాలు, విద్య సంస్థల్లో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా అందించిన సేవలు, విద్యాభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేశారు.

డీటీయూ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి



భూపాలపల్లి అర్బన్: ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్న ధర్మ టీచర్స్ యూనియన్ (డీటీయూ) ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని జిల్లా ఆవిర్భావ సన్నాహక కమిటీ బాధ్యులు శ్యామ్‌సుందర్ కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల నాయకత్వంలో ధర్మ టీచర్స్ యూనియన్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో పని చేస్తున్న ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, అనిల్, రాములు, రాజేష్, మొగిలి, రాజేందర్‌లు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధిగా సుమన్



భూపాలపల్లి రూరల్: ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధిగా మడిపెల్లి సుమన్ మాదిగను నియమించినట్లు ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమేశేఖర్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా, మండలాలు, పట్టణ నాయకులకు సుమన్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలు సమన్వయంతో జీవించాలి



ఏటూరునాగారం: ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలు సమన్వయంతో జీవించాలని, ఒకరి సంస్కృతి సంప్రదాయాలను మరొకరు గౌరవించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. మండల కేంద్రంలోని ఏఎస్పీ కార్యాలయంలో అయ్యప్పస్వామి మాలదారులు, అర్చకులు, ప్రజా సంఘాల నాయకులతో బుధవారం కో ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల చోటుచేసుకున్న పలు సంఘటనలను దృష్టిలో పెట్టుకొని ఏ వర్గం వారు అయినా ఏదైనా సమస్యలుంటే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడం, దూషించడం లాంటివి చేయరాదన్నారు. అన్ని వర్గాల సంరక్షణకు పోలీసుశాఖ పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ నిబంధనలు, చట్టాలకు లోబడి జీవించాలని వెల్లడించారు. బోడ సత్యం, పర్వతాల లాలయ్య, నాయకులు పాల్గొన్నారు.

‘పది’కి పక్కా ప్రణాళిక

ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి
- ప్రభుత్వ పాఠశాలల్లో మొదలైన ప్రత్యేక తరగతులు
- పరీక్షలపై విద్యార్థులకు ముందస్తు అవగాహన



మేడిపల్లి ఆశ్రమ పాఠశాలలో స్టడీ అవర్‌లో చదువుతున్న విద్యార్థులు

కాటారం: విద్యార్థులకు పదో తరగతి ఓ తొలిమెట్టు లాంటిది. వారి బంగారు భవిష్యత్‌కు దశ, దిశను నిర్దేశించేది పదో తరగతి. పదిలో మంచి ప్రతిభ కనబర్చితే విద్యార్థుల భవిష్యత్ బంగారు బాట పడుతోంది. విద్యార్థుల జీవితంలో విలువైన పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడం అంటే అనుకున్నంత సులువు కాదు. దీనిని అధిగమించేందుకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వినూత్న తరహాలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తూ విద్యను అందిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉన్నత స్థాయి ఫలితాలు సాధించేలా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఒక ప్రణాళికలను సిద్ధం చేసుకొని ముందుకు సాగుతున్నారు.

ప్రణాళికను పాటిస్తే ఉత్తమ ఫలితాలు..

ఆరేళ్లుగా పదో తరగతి పరీక్షా విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. పదో తరగతి విద్యార్థులకు 20 మార్కులు ఇంటర్నల్ కాగా, 80 మార్కులకు రాత పరీక్షలు ఉంటాయి. సీసీఈ ప్రశ్నావళి విధానంతో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నందునా వీటిని దృష్టిలో ఉంచుకొని ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు.

ముందస్తుగానే అవగాహన..

పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థులకు పాఠశాలల్లో ముందస్తుగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల స్థాయిలో ఉదయం, సాయంత్రం అదనంగా ఒక గంట పాటు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఎలా చదవాలి, ఎక్కువ మార్కులు వచ్చేందుకు అవగాహన కల్పిస్తున్నారు. రోజుకో పరీక్ష నిర్వహించి బిట్స్ ఎలా రాయాలో ప్రిపేర్ చేయిస్తున్నారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు.

ఫలితాల్లో ముందంజ..

జిల్లా వ్యాప్తంగా 97 ప్రభుత్వ సంబంధిత ఉన్నత పాఠశాలలు ఉండగా 26 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో కలుపుకొని 3,528 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. గతేడాది పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు పలువురు విద్యార్థులు 10 జీపీఏ సాధించి సత్తా చాటారు. మోడల్, టీటీడబ్ల్యూఆర్, పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో 10, 9 జీపీఏ సాధించి ముందంజలో నిలిచారు. ఈ ఏడాది సైతం 10 జీపీఏ సాధించడమే లక్ష్యంగా శ్రమిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తెలుపుతున్నారు.

జిల్లాలో పాఠశాలల వివరాలు..

	పాఠశాలల సంఖ్య	పదో తరగతి విద్యార్థులు
జెడ్పీ పాఠశాలలు	69	1,186
కేజీబీవీ	11	411
మోడల్ పాఠశాలలు	6	427
ఎంజేపీ పాఠశాలలు	3	229
టీఎం స్కూల్	01	62
టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్	02	148
టీటీడబ్ల్యూఆర్‌ఎస్	02	168
టీటీడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలలు	03	61
ప్రైవేట్ పాఠశాలలు	26	836

10 జీపీఏ లక్ష్యంగా..



ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు 10 జీపీఏ సాధించడమే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. రోజు వారీగా సబ్జెక్ట్ స్టడీ అవర్స్ నిర్వహిస్తూ విద్యార్థుల సందేహాలను తీర్చుతున్నాం. ఎలా రాస్తే మార్కులు ఎక్కువగా వస్తాయి, ఎలా చదవాలి అనే టిప్స్‌ను వివరిస్తూ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. వందశాతం ఉత్తీర్ణత, 10 జీపీఏ ఖచ్చితంగా సాధించి తీరుతాం.

– గండు రాజబాబు, ప్రధానోపాధ్యాయుడు, ఒడిపిలవంచ

పారదర్శకంగా భూ సర్వే



భూ సేకరణ నమూనాను పరిశీలిస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

కలెక్టర్ భవేష్‌మిశ్రా

గణపురం: రామప్ప చెరువు నుంచి గణపసముద్రం చెరువు వరకు అదనంగా నిర్మించనున్న కాల్వ నిర్మాణానికి రైతుల నుంచి భూములు తీసుకోవడానికి పారదర్శకంగా భూ సర్వే ప్రక్రియ చేపడుతామని, ఏ ఒక్క రైతుకు అన్యాయం జరుగకుండా చూస్తామని కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. బుధవారం రామప్ప చెరువు నుంచి గణపసముద్రం చెరువు వరకు కాల్వ నిర్మాణానికి ప్రభుత్వం తీసుకోనున్న భూములను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జే.చొక్కారావు దేవాదుల ఫీడర్ చానల్ రామప్ప చెరువు నుంచి గణపురం చెరువు వరకు 2.6 కీమీ వరకు పెంచడంతో మరింత ఆయకట్టు పెరుగుతుందన్నారు. దీనికోసం 7.24ఎకరాల భూమి అవసరం ఉంటుందన్నారు. ప్రాజెక్టును రైతులకు అతి తక్కువ నష్టంతో నిర్మించేందుకు, ప్రాజెక్టు నిర్మాణంలో ఎవరి భూమి ఎంత పోతుందో చూస్తూ ప్రత్యామ్నాయ మార్గాలు ఏమైన ఉన్నాయ అని తెలుసుకోవడానికి భూ సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. దీనికి రైతులు సహకరించాలన్నారు. భూసేకరణ 2016 చట్టం ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.డీ.సీ.ఎల్.ఏ డాక్టర్ నారాయణ, తహసీల్దార్లు సతీష్, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు..
- అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

మల్హర్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు కేజీబీవీ పాఠశాల ఎస్‌ఓను ఆదేశించారు. మండలంలోని మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని దబ్బగట్టు శివారులోని కస్తూర్బా గాంధీ (కేజీబీవీ) పాఠశాల, హాస్టల్‌ను అడిషనల్ కలెక్టర్ బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతాన్ని, వంట గది, స్టోరూం, బాత్రూమ్‌ల శుభ్రత, నీటి సౌకర్యం తదితర వాటిని ఆయన పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, ఆరోగ్య పరిస్థితి, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పి సరిత, ఎస్‌ఓ వెన్నల, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

టేకుమట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందనున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండలంలోని వెంకట్రావుపల్లిలో కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేసి ప్రజా పాలన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అలాగే ఎంపేడులో పోషమ్మ తల్లి దేవాలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కుందనపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని సర్పంచ్ పొన్నం కోమలచంద్రయ్య ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకే ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి పథకాలతో కోట్లాది ప్రజా ధనం దుర్వినియోగమైందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, తహసీల్దారు, ఎంపీడీఓ మంజుల, అనిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోటగిరి సతీష్‌గౌడ్, దాసారపు సదానందం, ఉమేందర్‌రావు, నేరేళ్ల శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అడగాని రామారావు, చింతలపెల్లి స్వామిరావు, నాయకులు తోడేటి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలి

చిట్యాల: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ప్రదర్శించి పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో శ్రీ సమ్మక్క– సారక్క హెరిటేజ్ ఆధ్వర్యంలో ఏబీవీపీ మండల శాఖ నిర్వహిస్తున్న జిల్లా స్థాయి పాఠశాల, కళాశాల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడు వెల్పుల రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గెలుపోటములు సహజమన్నారు. అనంతరం విద్యార్థులతో కబడ్డీ ఆడి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇరుకులపాటి పూర్ణ చందర్‌రావు, ఎంపీటీసీలు కట్కూరి పద్మ నరేందర్, దబ్బెట అనిల్, ఎండీ రాజ్‌మహ్మద్, ఎంఈఓ రఘుపతి, ఎస్సై జంగిలి రమేష్, రాంబాబు, కిరణ్, నిఖిల్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాటారం: ఉపాధ్యాయులు, ఉద్యోగుల జీవిత భద్రతకు పెనుముప్పుగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. కాటారం మండలం ఒడిపిలవంచ జెడ్పీహెచ్ పాఠశాల ఆవరణలో మండల శాఖ ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్, డైరీ, టేబుల్ క్యాలెండర్‌లను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగా సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు టీపీటీఎఫ్ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 317 జీఓ ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏ, ఆర్థిక బిల్లులను విడుదల చేయాలన్నారు. కోర్టు పరిధిలో ఉన్న కేసులను పరిష్కరించి ఉపాధ్యాయుల బదిలీల, ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బానోతు సేవానాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి గువ్వాడి జగపతిరావు, జిల్లా ఉపాధ్యక్షుడు గండు రాజబాబు, నాయకులు లక్ష్మయ్య, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, పుష్పలీల, వీరస్వామి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ములుగు ఎస్పీగా శబరీష్

ఆదిలాబాద్‌కు బదిలీ అయిన గాష్‌ఆలం



ములుగు: ములుగు ఎస్పీగా 2017 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ శబరీష్ నియమితులయ్యారు. మేడ్చల్ జోన్ సైబరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న శబరీష్‌ను ములుగు ఎస్పీగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ములుగు ఎస్పీగా పనిచేసిన గాష్ ఆలం ఆదిలాబాద్ ఎస్పీగా బదిలీ అయ్యారు. దీంతో పాటు గతంలో ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఓఎస్డీగా పనిచేసిన 2019 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అశోక్ కుమార్ జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు ఓఎస్డీగా నియమితులయ్యారు. జిల్లా ఎస్పీగా రానున్న శబరీష్ గతంలో మణుగూరు ఏఎస్పీగా విధులు నిర్వర్తించారు.

అభాగ్యులకు ‘సఖి’ భరోసా!

నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న కేంద్రం
- సత్వర న్యాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 181
- జిల్లాలో 639 కేసులు నమోదు



బాధితులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సఖి కేంద్రం నిర్వాహకులు

భూపాలపల్లి రూరల్: దేశం ఆధునిక యుగంలో ముందుకెళ్తున్నప్పటికీ మహిళలపై అనాగరిక, అటవిక చర్యలు జరుగుతూనే ఉన్నాయి. యువతులు, వివాహితలు, విద్యార్థినులు, బాలికలు సమాజంలో అనేక విధాలుగా వేధింపులకు గురవుతూనే ఉన్నారు. ఆమెను గృహ హింస, అక్రమ రవాణా, వరకట్న వేధింపులు తదితర ఎన్నో సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. ఇలాంటి బాధిత మహిళలు కొంత మంది తాము పడుతున్న ఇబ్బందులను బయటకు చెప్పుతుండగా మరికొందరు ఎవరికీ చెప్పుకోలేక తమలో తామే కుమిలిపోతున్నారు. జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన సఖి కేంద్రం ఇలాంటి వారికి బాసటగా నిలిచి వారిలో మనోధైర్యం నింపి భరోసా కల్పించడమే కాకుండా నిరాశ్రయులుగా మిగిలిన వారికి ఆశ్రయం కల్పిస్తూ అండగా నిలుస్తోంది.

అవగాహన కల్పిస్తూ..

జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామ పంచాయతీల్లోని వివిధ గ్రామాల్లో మహిళలు, విద్యార్థినులు నిత్యం ఏదో ఒక చోట వేధింపులకు గురవుతూనే ఉన్నారు. లైంగిక, మానసిక, శారీరక, ఆర్థిక, గృహ హింసలకు బలవుతున్నారు. అభద్రతా భావానికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా వాటిని అరికట్టేందుకు జిల్లాలో ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖకు అనుబంధంగా 2020 జనవరి 31న సఖి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ కేంద్రం వారు మహిళలు, యువతులు, హాస్టల్, పాఠశాలల్లో చదువుకునే విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారు.

అందించే సేవలివే..

సఖి కేంద్రం 24 గంటలు అందుబాటులో ఉంటుంది. వేధింపులు ఇతర కారణాలతో మానసికంగా ఇబ్బందులు పడుతున్న మహిళలకు కౌన్సిలింగ్ చేసేందుకు సామాజిక, మానసిక కౌన్సిలర్లు ఉంటారు. పోలీసుల సహకారం ఉండేలా చర్యలు తీసుకుంటారు. వైద్యసహాయంతో పాటు, న్యాయపరంగా సహాయం అందిస్తారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు నిబంధనల మేరకు తాత్కాలిక వసతి కల్పిస్తారు.

జిల్లాలో నమోదైన కేసులు..

కేంద్రం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో 639 కేసులు నమోదు కాగా అందులో 346 కేసులు 181 హెల్ప్‌లైన్ ద్వారా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. 407 గృహ హింస కేసులు, 37 మిస్సింగ్, 21 బాల్య వివాహాలు, 28 వరకట్నం, 07 లైంగిక వేధింపులు, 34 ప్రేమ చీటింగ్, 105 ఇతర కేసులు నమోదయ్యాయి. వీటిలో ఇప్పటి వరకు 535 కేసులను పరిష్కరించారు. 104 కేసులు విచారణలో ఉన్నాయి.

తక్షణ సాయానికి హెల్ప్‌లైన్ నంబర్..

ఆపదలో ఉన్న మహిళలు, సఖి సేవలు పొందాలనుకున్న వారు హెల్ప్‌లైన్ నంబర్ 181కు ఫోన్ చేస్తే వారు వెంటనే స్పందించి బాధితులను అక్కున చేర్చుకుంటున్నారు. ఇందులో పోలీసు, వైద్య సేవలతో పాటు న్యాయ సహాయం అందిస్తారు. భార్యాభర్తల విషయంలో కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరి సమస్యలను పరిష్కరిస్తున్నారు. వివిధ సంఘటనల్లో ఇంట్లో నుంచి బయటకు వచ్చిన మహిళలకు సర్వైవల్ కిట్స్ అందించి తాత్కాలికంగా ఆశ్రయం కల్పిస్తున్నారు.

నిత్యం అందుబాటులో..



వేధింపులకు గురవుతున్న మహిళలు, విద్యార్థినులు, బాలికలు, వివాహితులకు భరోసా, రక్షణ కల్పించేందుకు సఖి కేంద్రం 24 గంటలు పని చేస్తుంది. నిర్భయంగా 181 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందిస్తే తక్షణమే స్పందిస్తాం. వారికి అండగా ఉండి సమస్యలు పరిష్కరిస్తాం.

– అక్కపల్లి గాయత్రి, సఖి కేంద్రం నిర్వాహకురాలు

‘గ్రేటర్’లో బీఆర్‌ఎస్‌కు షాక్

- ఆరుగురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరిక
- మర్యాదపూర్వకంగా సీఎం రేవంత్‌ను కలిసిన నాయకులు



కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు



సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కార్పొరేటర్లు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్‌లో పలువురు కార్పొరేటర్లు బీఆర్‌ఎస్‌కు షాక్ ఇచ్చారు. ఆ పార్టీకి చెందిన ఆరుగురు కార్పొరేటర్లు, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ ఆధ్వర్యంలో హస్తం గూటికి చేరారు. బుధవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీప్‌దాస్ మున్షీ సమక్షంలో చేరారు. ప్రజాప్రతినిధులు, నాయకులకు ఆమె పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హనుమకొండ బీఆర్‌ఎస్‌కు చెందిన 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, 49వ డివిజన్ – మానస , 50వ డివిజన్ – నెక్కొండ కవిత ,9వ డివిజన్ – చీకటి శారద ,48వ డివిజన్ – షార్జా బేగం, 31వ డివిజన్ – మామిండ్ల రాజయ్య(రాజు)లు కాంగ్రెస్ చేరారు. అంతేకాక మాజీ కార్పొరేటర్లు వీరగంటి రవీందర్ స్వామి చరణ్, తాడిశెట్టి విద్యాసాగర్, వేల్పుల మోహన్ రావు, చీకటి ఆనంద్, నెక్కొండ కిషన్, నలుబోల సతీష్, నాయకులు గోల్కొండ రాంబాబు, మైసారపు సిరిల్ లారెన్స్, సిల్వేరు విజయ్ భాస్కర్, పోగుల శ్రీనివాస్‌లు అధికార పార్టీలోకి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకన్న, జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమాన్ సయ్యద్ విజయశ్రీ, నాయకులు రజాలి, బంక సరళ సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ పట్టుకోసం కాంగ్రెస్ పావులు

గ్రేటర్ మున్సిపాలిటీపై పట్టుబిగించేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా వలసల ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల ముందు కొందరు బీఆర్‌ఎస్‌నుంచి కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా మారికొందరు పార్టీని వీడారు. ఇదిలా ఉండగా వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాలకు చెందిన మరికొంత మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఆయా నియోజకవర్గాల అధికార పార్టీ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు జరిపాక పార్టీలో వెళ్లే అవకాశం ఉంది.

క్లుప్తంగా

గోదామాధవ కేంద్రంలో గాజుల పండుగ



గోదాఅమ్మవారికి గాజుల పూజ చేస్తున్న శ్రీనివాసాచార్య స్వామి

హన్మకొండ కల్చరల్: హనుమకొండ వికాస్‌నగర్‌లోని గోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రంలో బుధవారం ఉదయం 18వరోజు తిరుప్పావై వ్రత పూజలు నిర్వహించారు. కేంద్రం నిర్వాహకులు ఆరుట్ల శ్రీనివాసాచార్య స్వామి ఆధ్వర్యంలో ఆపదుద్ధారక స్వామికి ప్రత్యేక అలంకరణ, అష్టోత్తర శతనామార్చనలు, ప్రత్యేక పూజలు, ఆరగింపు, మంగళహారతి నిర్వహించారు. అనంతరం గాజుల పూజ జరిగింది. గోదా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పూలతో శోభాయమానంగా అలకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల గాజులు, పండ్లు, పసుపు, కుంకుమ, తాంబూలాలు సమర్పించారు. కార్యక్రమంలో వెన్నపురెడ్డి రమణారెడ్డి, సరళ దంపతులు, శేషుప్రియ తదితరులు పాల్గొన్నారు.

తల్లి, కుమారుడి అదృశ్యం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గ్రామానికి చెందిన మేకల అనిత తన కుమారుడు హర్షవర్ధన్‌తో కలిసి అదృశ్యమయ్యారు. డిసెంబర్ 30వ తేదీన తల్లి, కుమారుడు ఇంటి నుంచి బయటకు వెళ్లారు. తిరిగి రాకపోవడంతో అనిత భర్త మల్లయ్య.. వారి కోసం పలుచోట్ల వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి బుధవారం తెలిపారు.

జాతరలో భక్తులకు ప్రశాంత దర్శనం

- దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్
- మేడారంలో పూజారులతో సమీక్ష



హన్మకొండ కల్చరల్ : అమ్మవారి సన్నిధిలో దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, శ్రీకాంతారావు

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం మహాజాతరలో భక్తులకు ప్రశాంత దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తామని దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం మేడారంలో పూజారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు జాతరలో పూజా కార్యక్రమాల నిర్వహణ, సౌకర్యాలు, తదితర అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాతరలో భక్తులు ఇబ్బందులు తలెత్తకుండా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేపడతామన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం జాతర నిర్వహిస్తామన్నారు. పూజారులు తమ దృష్టికి తీసుకువచ్చిన వసతులన్నీ ఏర్పాటు చేస్తామన్నారు. పూజారులకు ఐడీ కార్డులు జారీ చేసి జాతరలో ఇబ్బందులు పడకుండా చూస్తామన్నారు. పూజారుల నిర్ణయం మేరకు భక్తుల సౌకర్యార్థం ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి క్యూలైన్ భక్తులకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఈసారి జాతరలో భక్తులు నేరుగా గద్దెలపై బెల్లం విసరకుండా కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేస్తామన్నారు. జాతరలో దేవాదాయ శాఖ తరపున భవన నిర్మాణం చేపడతామని, దీనికి స్థానికులు భూమి ఇస్తే, భూమికి బదలు భూమి గాని, పరిహారం గాని, పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. మేడారం ఈఓ రాజేంద్రం బదిలీపై వస్తున్న వార్తలు అవాస్తమని, ఆయనను బదిలీ చేసే ఆలోచన లేదన్నారు. కాగా, సమీక్షకు ముందు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జాతరలో దేవాదాయ శాఖ తరపున చేపడుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు, ఈఓ రాజేంద్రం, సూపరిండెంటెంట్ క్రాంతికుమార్, డీఈ రమేష్, ఏఈ వీరచందర్, పూజారులు రఘుపతి, చంద గోపాల్, మునీందర్, కాక సారయ్య, కాక కిరణ్, సిద్దబోయిన అరుణ్, వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్



తాడ్వాయి : మాట్లాడుతున్న కమిషనర్ అనిల్‌కుమార్

హన్మకొండ కల్చరల్ : చారిత్రక భద్రకాళి దేవాలయాన్ని బుధవారం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ వి. అనిల్‌కుమార్ సందర్శించారు. కమిషనర్ వెంట వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ టి. శ్రీకాంతారావు ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శేషుభారతి, అర్చకులు భద్రకాళి శేషు వారిని ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ముందుగా ఆదిశంకరులు, వల్లభగణపతిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు జరిపారు. వారికి అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో మేడారం సమ్మక్క, సారలమ్మ దేవాలయ ఈఓ రాజేంద్రం , వరంగల్ దేవాదాయశాఖ కార్యాలయ పర్యవేక్షకుడు వీరస్వామి, పరిశీలకుడు సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

వృద్ధురాలి హత్య కేసు ఛేదన..

- మంత్రాల నెపంతోనే ఘాతుకం
- వివరాలు వెల్లడించిన ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్



నిందితుల అరెస్టు చూపుతున్న డీసీపీ

ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు గోనె సోమలక్ష్మి(70) గత నెల 26వ తేదీన అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ కేసును పోలీసులు సవాల్‌గా తీసుకుని వారం రోజుల్లోనే ఛేదించారు. ఈ మేరకు బుధవారం ఈస్ట్‌జోన్ డీసీపీ పులిగిల్ల రవీందర్ విలేకరుల సమావేశంలో వృద్ధురాలి హత్య వివరాలు వెల్లడించారు. సోమలక్ష్మిని ఆమె చిన్న కుమారుడు సాయిలు హత్య చేయొచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ మృతురాలి భర్త, ఆమె పెద్ద కుమారుడు మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే సోమలక్ష్మి మృతి చెందిన రాత్రి ఆమె చిన్న కుమారుడు సాయిలు .. ఓ రైస్ మిల్లులో పనికి వెళ్లి అక్కడే నిద్రించాడని సీసీ కెమెరాల ద్వారా తెలిసింది. దీంతో సాయిలు హత్య చేయలేదనే నిర్ధారణకు వచ్చిన పోలీసులు.. వృద్ధురాలిని హత్యచేయాల్సిన అవసరం ఎవరికుందనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో సోమలక్ష్మికి మంత్రాలు వస్తాయనే అపవాదు ఉన్నట్లు గుర్తించారు. ఈ కోణంలో దర్యాప్తు ప్రారంభించగా గత నెల 17వ తేదీన సోమలక్ష్మి ఇంటి పక్కన ఉండే గోనె మధు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధు తండ్రి పెద్దరాజు సోమలక్ష్మి ప్రవర్తనను అనుమానించాడు. మధు మృతికి సోమలక్ష్మి కారణమై ఉంటుందని ఆమె పై కోపం పెంచుకున్నాడు. దీంతో సోమలక్ష్మిని హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. మధు దశదిన కర్మ 27న ఉండగా ముందు రోజు రాత్రి పెదరాజు, తన సడ్డకుడు సంగెం మండలం మొండ్రాయి గ్రామానికి చెందిన పెండ్లి యుగంధర్, అల్లుడు అనుముల రంజిత్, చిన్న కుమారుడు అనిల్, అనిల్ స్నేహితుడు ముస్కు రాజశేఖర్ పథకం ప్రకారం సోమలక్ష్మిని కర్రలతో తలపై మోది హత్య చేశారు. ఎవరికీ అనుమానం రావొద్దనే ఉద్దేశంతో సోమలక్ష్మిని మంచంపై పడుకోబెట్టి, చద్దరు కప్పి నిర్మాణంలో ఉన్న గోడల మధ్య ఉంచి వెళ్లిపోయారు. సోమలక్ష్మి చిన్న కుమారుడు సాయిలు మద్యం సేవించి వచ్చి తల్లిదండ్రులను కొడతాడని తెలిసి హత్యను అతడిపై నెట్టే ప్రయత్నం చేశారు. ఆ రోజు సాయిలు రైస్‌మిల్లులోనే ఉన్నాడని పోలీసులు నిర్ధారించుకోగా హత్య కోణం బయట పడిందన్నారు. దీంతో దోషులను అరెస్టు చేసి నిర్దోషి సాయిలుకు శిక్షపడకుండా చేయడం సంతోషం కలిగించిందని డీసీపీ పేర్కొన్నారు. ఐదుగురు నేరస్తుల్లో అనుముల రంజిత్ పరారీలో ఉండగా మిగతా నలుగురిని అరెస్టు చేశామన్నారు. సమావేశంలో ఏసీపీ చిర్ర సతీష్‌బాబు, సీఐ శ్రీనివాస్, ఎస్సై నవీన్‌కుమార్ ఉన్నారు. కాగా, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మధు ఆత్మహత్యకు పాల్పడడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. సోమలక్ష్మి మృతికి గల కారణాలను వేగంగా ఛేధించిన పోలీసులు.. మధు ఆత్మహత్య విషయంలో కూడా వేగంగా దర్యాప్తు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

- 15 లీటర్ల సరుకు, 10కిలోల పటిక స్వాధీనం
- ముగ్గురిపై కేసు నమోదు



గుడుంబా తయారీకి ఉపయోగించే డ్రమ్ములను తగులబెడుతున్న అధికారులు

గోవిందరావుపేట : తాడ్వాయి మండలం నార్లాపూర్, రెడ్డిగూడెం, గోవిందరావు పేట మండలం పాపయ్యపల్లి గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి 1500 లీటర్ల పులియబెట్టిన బెల్లం పానకం పారబోసి 15 లీటర్ల గుడుంబా, 10కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ శాఖ వరంగల్ డివిజన్ డీసీ అంజన్ రావు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆఫీసర్ శ్రీనివాస్, స్టేట్ టాస్క్‌ఫోర్స్ సీఐ లతీఫ్, డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ సీఐ ఆర్ రాజనర్సయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై ఎం కిశోర్ బాబు, ములుగు ఎక్సైజ్ ఎస్సై ఆర్ రాజన్న, సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయాల భూములను కాపాడాలి

- తెలంగాణ అర్చక ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ



ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో దేవాదాయశాఖ అర్చక ఉద్యోగులు

హన్మకొండ కల్చరల్ : తెలంగాణ రాష్ట్రంలో అన్యాక్రాంతమైన దేవాలయాల భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని తెలంగాణ అర్చక ఉద్యోగులు జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో జాక్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను రాష్ట్ర దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ జ్యోతి కురాకుల, కార్యనిర్వహణాధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ, తెలంగాణ రాష్ట్రంలోని వివిధ దేవాలయాల వేద పండితులు, అర్చకఉద్యోగులు కలిసి వారి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ముందుగా అర్చకులు.. ఉపముఖ్యమంత్రిని సన్మానించి వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భగా ఉపేంద్రశర్మ మాట్లాడుతూ అన్యాక్రాంతమైన ఆలయాల భూములను కాపాడి ఉన్నత న్యాయస్థానం అనుమతితో వేలంలో అమ్మివేయడం ద్వారా వచ్చే ఆదాయంతో దేవాలయాలను అభివృద్ధి చేయొచ్చన్నారు. దీనిపై దేవాదాయశాఖ మంత్రితో సమీక్షించాలని కోరారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ నుంచి 577 జీవో ప్రకారం 5,625 మందికి వేతనాలు రావాల్సి ఉండగా 3వేల మందికి మాత్రమే రాష్ట్ర ఖజానా నుంచి ఇస్తున్నారని, దేవాదాయశాఖ ఇచ్చిన 121 జీవోను వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో దేవాలయాల రాష్ట్ర ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కొండేటి కృష్ణమాచారి, భద్రీనారాయణ, నిట్టూరి సతీష్‌శర్మ, పెన్నా మోహన్‌శర్మ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న బాలుడి మృతి

డోర్నకల్: డోర్నకల్ మండలం రాముతండాకు చెందిన బాలుడు వేడినీళ్లు మీద పడి గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండాకు చెందిన నూనావత్ వీరన్న, కల్యాణి దంపతులకు ముగ్గురు కుమారులు భార్గవ్, రామ్, శ్రీలక్ష్మణ్(03) ఉన్నారు. ఇందులో రామ్, శ్రీలక్ష్మణ్ కవలలు. ఈ క్రమంలో గత నెల 31వ తేదీన పిల్లలకు స్నానం చేయించేందుకు కల్యాణి వేడినీళ్లు సిద్ధం చేసింది. పిల్లలు ఆడుకుంటూ వెళ్లి బకెట్‌కు తగలగా వేడినీరు శరీరంపై పడింది. దీంతో శ్రీలక్ష్మణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీలక్ష్మణ్ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. అఫ్జల్‌గంజ్ పీఎస్‌లో కేసు నమోదు కాగా శ్రీలక్ష్మణ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. కాగా, తల్లిదండ్రులు.. శ్రీ లక్ష్మణ్ మృతదేహంపై పడి దిక్కులు పిక్కటిల్లేలా రోదించారు. శ్రీలక్ష్మణ్ మృతితో కుటుంబంతోపాటు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

తాటిచెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు..



యాకయ్య (ఫైల్)

పాలకుర్తి టౌన్: తాటిచెట్టుపై నుంచి పడి ఓ గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన పాలకుర్తి మండలం దర్దేపల్లిలో జరిగిది. గ్రామానికి చెందిన గిరగాని యాకయ్య(47) రోజుమాదిరిగా బుధవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో జారి కింద పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉంది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు కోరారు. కాగా, గీత కార్మికుడి కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని గౌడ జనహక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూల వెంకటేశ్వర్లు గౌడ్ కోరారు.

కుంటలో పడి వ్యక్తి గల్లంతు



వెంకటనర్సింహులు కోసం గాలిస్తున్న గజ ఈత గాళ్లు

వర్ధన్నపేట: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి కుంటలో పడి గల్లంతయ్యాడు. ఈ ఘటన బుధవారం వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బెజ్జంకి వెంకటనర్సింహులు మంగళవారం సాయంత్రం గ్రామశివారులోని కుంటలో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో నీటి గుంతలో పడి గల్లంతయ్యాడు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు గజ ఈతగాళ్లు గాలించినా వెంకటనర్సింహులు ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో రాత్రి కావడంతో గజఈతగాళ్లు వెనుదిరిగారు.

భార్య జ్ఞాపకాలు మరువలేక..

- మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య
- ఛాగల్లులో ఘటన



వెంకటయ్య (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: భార్య జ్ఞాపకాలు మరువలేక ఓ వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం మండలంలోని ఛాగల్లులో జరిగింది. గ్రామానికి చెందిన లొంక వెంకటయ్య(57) భార్య అండాలు నెలరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి వెంకటయ్య మనోవేదనకు గురవుతున్నాడు. కాగా, రెండు రోజుల క్రితం అండాలు నెలమాసికం నిర్వహించారు. అయితే అండాలు జ్ఞాపకాలను మరచిపోని వెంకటయ్య ఇంటి సమీపంలో పురుగుల మందుతాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబీకులు వెంకటయ్యను వెంటనే అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సట్ల రాజు తెలిపారు.

ప్రతిభతోనే విద్యార్థులకు గుర్తింపు



విద్యార్థులు వేస్తున్న సైన్స్ బొమ్మలను పరిశీలిస్తున్న నిర్ణేతలు, లెక్చరర్లు

ఏటూరునాగారం: ప్రతిభతోనే విద్యార్థులకు గుర్తింపు లభిస్తుందని ములుగు జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, ఎంపీపీ అంతటి విజయ అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల క్రీడా పాఠశాలలో బుధవారం భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు జిల్లాలకు చెందిన 966 మందితో ఇగ్నో ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, ఎంపీపీ అంతటి విజయ, ఆర్‌సీఓ అగస్టిన్ హాజరై జ్యోతిప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా పాఠశాలలు, డిగ్రీ, జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి అలరించారు. విద్యార్థులు తయారు చేసిన శకటాలను ముఖ్యఅతిథులు పరిశీలించి ఎంపిక చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిలో ప్రతిభ ఉంటుందని, వాటిని వెలికి తీసేందుకే ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. వారిలో ఉన్న నైపుణ్యం విద్య, క్రీడ, ప్రయోగశాలలోనే బయటపడుతుందన్నారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను భద్రాచలంలో జరిగే ఇగ్నో ఫెస్టివల్‌కు పంపించనున్నట్లు గురుకులాల రీజనల్ కోఆర్డినేటర్ ఆగస్టిన్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈసం రామ్మూర్తి, రాజారాం, రమణ, జైపాల్ పాల్గొన్నారు.

విద్యార్థుల నూతన ఆవిష్కరణలు



ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

వరంగల్ చౌరస్తా: వరంగల్ యాకూబ్‌పురాలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో బుధవారం ప్రాంతీయ ఇగ్నైట్ ఫెస్ట్(సైన్స్‌ఫేర్)–2024 జరిగింది. ఈ కార్యక్రమానికి రీజినల్ ట్రైబల్ వెల్ఫేర్ హైస్కూల్స్ కన్వీనర్ వెంకన్న ముఖ్యఅతిథిగా హాజరై సైన్స్ ఫేర్‌ను ప్రారంభించారు. వివిధ గిరిజన రెసిడెన్షియల్ల నుంచి సుమారు 1200 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఆధునిక పరిశోధనలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో రెసిడెన్షియల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై గొడ్డలితో దాడి..

- తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి
- అంబట్‌పల్లిలో ఘటన



పద్మ (ఫైల్)

మహదేవపూర్: పాత కక్షల నేపథ్యంలో ఓ మహిళపై గొడ్డలితో దాడికి పాల్పడగా ఆమె మృతి చెందింది. ఈ ఘటన మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పాత కక్షల నేపథ్యంలో అంబట్‌పల్లి అమరేశ్వర ఆలయంలో బుధవారం ఉదయం అయ్యప్ప మాలధారుడు పుట్ట నరసింహస్వామి.. మరో మాలధారుడు నల్ల అవినాశ్‌పై కత్తితో దాడికి పాల్పడగా స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనను చూసిన సహా మాలధారులు ఇద్దరిని సముదాయించి ఇంటికి పంపించారు. అనంతరం నరసింహస్వామి గొడ్డలితో అవినాశ్ ఇంటికి చేరకున్నాడు. అక్కడ అతడు కనిపించకపోవడంతో ఆగ్రహం చెందిన నరసింహస్వామి.. అవినాశ్ తల్లి పద్మ (40)పై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న పద్మను స్థానికులు మహదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. దీంతో పద్మ మృతదేహానికి ఆరోగ్య కేంద్రంలో పోస్టుమార్టం నిర్వహించి అంబట్‌పల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనపై మృతురాలి భర్త నల్ల భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ..

- కేసముద్రం మండల కేంద్రంలో ఘటన



బీరువాను పరిశీలిస్తున్న రూరల్ సీఐ రమేష్, ఎస్సై వంశీధర్

కేసముద్రం: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని కిష్టాపురం వీధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కేసముద్రంస్టేషన్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి రామచంద్రయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి నెల్లికుదురు మండలంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. కాగా, రామచంద్రయ్య కుమారుడు డ్యూటీకి వెళ్లి బుధవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళం తీసి, బీరువా తెరిచి ఉంది. దీంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. మహబూబాబాద్ రూరల్ సీఐ రమేష్, కేసముద్రం ఎస్సై వంశీధర్ ఘటనా స్థలికి చేరుకుని బీరువాను పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం చేరుకుని వేలిముద్రలు సేకరించింది. ఈ ఘటనలో దొంగలు 4 తులాల బంగారం, కొంత నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఘటనను పరిశీలిస్తే బీరువాలో ఇంకా కొంత బంగారం ఉండడంతో పలుకోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



హనుమకొండ నక్కలగుట్ట విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హన్మకొండ: వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ అందించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి సూచించారు. బుధవారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయాన్ని ప్రతి విభాగాన్ని పరిశీలించారు. అనంతరం నక్కలగుట్ట విద్యుత్ 33/11 కేవీ సబ్ స్టేషన్, ఎంఆర్‌టీ డివిజన్‌ను పరిశీలించారు. ఏఏ పనులు చేస్తున్నారో ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యుత్ స్టోర్స్‌ను సందర్శించారు. స్టోర్స్‌లోని మెటీరియల్‌ను పరిశీలించారు. మెటీరియల్ పంపిణీ, నిర్వహణ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్దమ్మగడ్డలోని ట్రాన్స్‌కో 220 కేవీ సబ్ స్టేషన్ సందర్శించి విద్యుత్ సరఫరా జరుగుతున్న తీరు, అంతరాయాలు, ఆటంకాలు గురించి ఉద్యోగులను అడిగారు. తర్వాత వరంగల్ సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సబ్‌స్టేషన్ల నిర్వహణ క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. వినియోగదారులు సంస్థకు ప్రధానమని, వారికి ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి విధులు సక్రమంగా నిర్వర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ, వరంగల్ ఎస్ఈ మధుసూదన్, డీఈలు జి.సాంబారెడ్డి, ఎ.విజేందర్ రెడ్డి, ఎ.ఆనందం, ఏడీ మల్లికార్జున్, అనిల్ కుమార్, జానకీరాం రెడ్డి, ఏఈలు, ఉద్యోగులు పాల్గొన్నారు.